క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గొలుగొండ: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. గొలుగొండలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ అడిగర్ల అప్పల నాయుడు, మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు,రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, రాయపురెడ్డి రాంబాబు, చిట్టిబాబు, గండెం రాము పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని వజ్రగడలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. రైతుల అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీటీలు సోమశేఖర్, కృష్ణమూర్తి తెలిపారు.

మాడుగుల రూరల్: తాటిపర్తి, శంకరం గ్రామ సచివాలయాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు కె.రమాదేవి అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ జగదీష్, రీసర్వే డీటీ గణపతిరావు పాల్గొన్నారు.

రాజుబాబుకు ఘన నివాళి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ: దివంగత సీపీఐ నాయకుడు రాజుబాబుకు ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి తదితరులు ఘనంగా నివాళులర్పించారు. రాజుబాబు 26 వర్ధంతి సందర్భంగా చోద్యంలో స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, అభిమానులు, ఎస్ఎఫ్ఐ నాయకుడు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ క్యాంపులు

మాకవరపాలెం: మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురువారం తాడపాల, గంగవరం, తామరం, శుక్రవారం జి.కోడూరు, మాకవరపాలెం, తూటిపాల సచివాలయాల వద్ద ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు.

28 వరకు మొబైల్ ఆధార్ క్యాంప్‌లు

రోలుగుంట: మండలంలో ఈ నెల 17న ప్రారంభమైన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంప్‌లను 28 తేదీ వరకూ పలు గ్రామాల్లో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

124 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు: శీతాకాలంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. ఆనందపురంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 124 మందికి వైద్యసేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలం శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. హెచ్.వి. భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్ఎం పద్మ పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడి శివారులో సారా తరలిస్తున్న బేతపూడికి చెందిన యు.అచ్చిబాబును ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచినట్టు చోడవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ బాపునాయుడు, ఎస్ఐ కె.హనుమంతు తెలిపారు.

వలస నాయకులకు పదవులివ్వడం బాధించింది

- దేవరాపల్లి టీడీపీ నాయకుల ఆవేదన

దేవరాపల్లి: సాగు నీటి సంఘాల పదవులను వలస నాయకులకు కట్టబెట్టడం తమను ఎంతగానో బాధించిందని దేవరాపల్లి టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లి దేముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలోని టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లేటి కరుణాకర్‌రావు నివాసంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాము మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని విమర్శించామనడంలో వాస్తవం లేదన్నారు. కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసిన తాము కోరిన ఒక్క డైరెక్టర్ పదవి కూడా ఇవ్వకుండా ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులకు ఇవ్వడం తమకు బాధ కలిగించిందన్నారు.

దేవరాపల్లి పీహెచ్‌సీకి మహర్దశ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అదనపు భవనానికి రూ. 1.70 కోట్లు మంజూరు
- అప్పట్లోనే ప్రారంభమైన భవన నిర్మాణ పనులు
- సార్వత్రిక ఎన్నికల ప్రక్రియతో నిలిచిన నిర్మాణం
- తాజాగా పునఃప్రారంభం
- గతంలోనే నాడు–నేడులో రూ. 50 లక్షలతో ఆధునికీకరణ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడులో ఆధునికీకరించిన దేవరాపల్లి పీహెచ్‌సీ



దేవరాపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మహర్దశ పట్టింది. దేవరాపల్లి మండలంతో పాటు అల్లూరి జిల్లా అనంతగిరి, విజయనగరం జిల్లా వేపాడ మండలాల పరిధిలోని ప్రజలకు వైద్య సేవలందించే ఈ పీహెచ్‌సీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చిన్నపాటి వర్షానికే అన్ని గదులు కారిపోయేవి. వైద్యులు, వార్డు, మందుల గదులతో పాటు ఆపరేషన్ థియేటర్ సైతం కారిపోయి మందులు, సామగ్రి తడిసిముద్దయ్యేవి. దీంతో రోగులతో పాటు వైద్య సిబ్బంది నరక యాతన అనుభవించేవారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. నాడు–నేడు పథకంలో రూ. 50 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపట్టి రూపురేఖలను మార్చారు. అనంతరం ఇక్కడి ఆస్పత్రి పరిస్థితిని అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అప్పటి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జగన్‌మోహన్ రెడ్డి అదనపు భవనం నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో అప్పట్లోనే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభమయ్యేలా బూడి ముత్యాలనాయుడు చర్యలు చేపట్టారు. పనులు ప్రారంభించిన తర్వాత సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తాజాగా భవన నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ భవనం పూర్తయితే ఆస్పత్రిలో వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

రోజుకు 100 మందికివైద్య సేవలు

పీహెచ్‌సీ పరిధిలో 11 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా, 10 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీలో సుమారు 80 నుంచి 100 వరకు ప్రతి రోజు ఓపీ సేవలు అందిస్తారు. స్థానిక పీహెచ్‌సీలో దశాబ్దాల వసతి సమస్యకు పరిష్కార మార్గం చూపిన మాజీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఐసోలేషన్ వార్డు నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు

ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డు (బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్) నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేయగా తాజాగా రూ. 50 లక్షలు మంజూరు చేశారు. కోవిడ్ లాంటి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలందించేందుకు ఈ భవనాన్ని మంజూరు చేశారు. ఈ పనులను ప్రారంభించేందుకు అధికారులుకు సన్నహాలు చేస్తున్నారు.

భవన సమస్యకు శాశ్వత పరిష్కారం



చిన్నపాటి వర్షం వచ్చినా పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, వార్డు, మందుల నిల్వ గది, వైద్యుల గది కారిపోయేవి. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, రోగులు నానా అవస్థలు పడేవారు. గత ప్రభుత్వం పీహెచ్‌సీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ. 50 లక్షలతో నాడు–నేడులో ఆధునికీకరించడం పాటు అదనపు భవన నిర్మాణానికి రూ. 1.70 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులు పూర్తయితే ఆస్పత్రి భవనాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.
– డి.వెంకన్న, సీపీఎం నాయకుడు, దేవరాపల్లి.

మార్చి నెలాఖరుకు పనులు పూర్తి



పీహెచ్‌సీలో రూ. 1.70 కోట్లతో అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్చి నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు తాజాగా రూ. 50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఈ పనులు ప్రారంభించి అగ్రిమెంట్ మేరకు మూడు నెలలో పూర్తి చేయాల్సి ఉంది.
–పి. శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఏఈఈ, దేవరాపల్లి.

త్వరలో ఐసోలేషన్ వార్డు నిర్మాణం



స్థానిక పీహెచ్‌సీలో ఆవరణలో నూతన భవనం నిర్మాణంలో ఉంది. ఈ భవనం నిర్మాణ పనులు పూర్తయితే సమస్య తీరుతుంది. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (ఐసోలేషన్ వార్డు) నిర్మాణానికి మరో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు గాను ముందస్తుగా ఈ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు.
– ఈ.పూజ్య మేఘన, పీహెచ్‌సీ వైద్యాధికారి, దేవరాపల్లి.

టెన్త్ మోడల్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రామకొండలరావు

మాడుగుల రూరల్: ప్రతి విద్యార్థి బాగా చదవి టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య మాజీ కౌన్సిలర్, స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. యూటీఎఫ్ రూపొందించిన టెన్త్ మోడల్ పేపర్లను కేజే పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 58 మంది విద్యార్థులకు బుధవారం ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. రామకొండలరావుతో పాటు జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి పొలిమేర చంద్రరావు ఆర్థిక సాయంతో వీటిని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.దేముడమ్మ, హెచ్ఎం వి.దాసు, సర్పంచ్ జామి రమణబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి సంతోష్, ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లినాయుడు, సీఆర్‌పీ నిద్దాన సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది క్లస్టర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కాశీపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్: మండలంలోని ఎనిమిది క్లస్టర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. తాటిపర్తి శివారు కాశీపురం, శంకరం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్పపీడనం దృష్ట్యా వరి కోతలు వాయిదా వేసుకోవాలని, కోసిన పంటను కుప్పలుగా పెట్టుకోవాలని తెలిపారు. తాటిపర్తి, శంకరం, వీహెచ్ఏలు బి.ఆలేఖ్య, పి.దేవి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 21న నర్సీపట్నంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత కోరారు. శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను యూత్‌పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఇంటి వద్ద జరిగే రక్తదాన శిబిరానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు

మాకవరపాలెం: నర్సీపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రుత్తల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నాయకులు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, సీనియర్ నాయకులు రుత్తల శ్రీనివాస్, పెట్ల భద్రాచలం, పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, కమిషన్ ఏర్పాటుకు చట్టబద్ధత లేదని దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్యకమిషన్ చైర్మన్ రాజీవ్ మిశ్రాకు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం తమ అభ్యంతరాలు తెలిపారు. మండల అంబేడ్కర్ ఆశయ సాధన సమితి నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, మాల మహానాడు ఉత్తరాంధ్ర నాయుకులు గొల్ల ఈశ్వరరావు, ఎల్ల రాంబాబు, రిట్టపల్లి పెంటయ్య, వెలమర విష్ణు, తదితర్లు వర్గీకరణ తీర్పు తదితర అంశాలపై లిఖిత పూర్వకంగా తమ అభ్యంతరాలను తెలియజేశారు. వర్గీకరణకు అనుమతినిస్తూ ఆగస్టులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కు విరుద్ధమని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.



కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న కోటి

ఎస్సీ వర్గీకరణ అమలు చేయవద్దు

బుచ్చెయ్యపేట: అన్నదమ్ముల్లా కలిసి ఉన్న దళితులను విడదీసే ఎస్సీ వర్గీకరణ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా మాల మహానాడు యువజన అధ్యక్షుడు బూసి కోటి ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. విశాఖలో బుధవారం కమిషన్‌ను జిల్లా మాల మహానాడు సంఘం సభ్యులు కలిసి సమస్యలు విన్నవించారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ వర్గీకరణను తెరపైకి తీసుకొచ్చిందని, మళ్లీ ఇప్పుడు అమలు చేయాలని యత్నిస్తోందని వారు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు చట్టసభల్లో బిల్లు పెట్టాలన్నారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గీకరణ చేయడం తగదన్నారు. సియాద్రి శ్రీను,పరవాడ ఈశ్వరరావు,సేవా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



ర్యాలీలో పాల్గొన్న ఏఈఈ శంకరరావు

దేవరాపల్లి: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని విద్యుత్ శాఖ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం బేతపూడిలో ర్యాలీ నిర్వహించి ఇంధనం పొదుపు చేద్దాం, భావితరాలకు వెలుగునిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

కె.కోటపాడు : నర్సీపట్నంలో ఈ నెల 20 నుంచి 22 వరకూ జరిగే సీపీఎం 24వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు. జిల్లా మహాసభలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆటో యూనియన్ సభ్యులతో కలిసి ఆయన బుధవారం కె.కోటపాడులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ఎల్లప్పుడూ రైతులు, కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజావ్యతిరేఖ నిర్ణయాలపై ఈ మహసభల్లో చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

దేవరాపల్లి: నర్సీపట్నంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బి.టి.దొర కోరారు. జిల్లా మహా సభల వాల్ పోస్టర్లను వాలాబు పంచాయతీలో స్థానిక గిరిజనులతో కలిసి బుధవారం ఆవిష్కరించి, మాట్లాడారు.



రోలుగుంటలో పనలను కుప్పగా పెడుతున్న రైతులు

కర్షకుల్లో కలవరం

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు
- పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు
- కోతలు వాయిదా వేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

రోలుగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చివరి దశలో కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటను రక్షించుకునేందుకు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. రోలుగుంట, కొడపాలెం,కొమరవోలు, శరభవరం, బుచ్చింపేట తదితర ప్రాంతాల్లో నాలుగు రోజుల క్రితం వరి పంటను కోసి పనలు ఆరబెట్టారు. ఈ తరుణంలో వర్షాలు కురుస్తుండడంతో పంటను రక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వడివడిగా మోపులు కట్టి కుప్పలు పెట్టుకుంటున్నారు. కొంతమంది ట్రాక్టర్లతో పంటను గ్రామాల్లోకి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. టాక్టర్లు లభించనివారు పొలాల్లోనే కుప్పలు వేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశామని, పంట చేతికి వచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండడంతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోసిన వరి పనలుపై ఉప్పుద్రావణం జల్లి రంగురాకుండా, మొలకెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించడంతో ఏం చేయాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు.

కె.కోటపాడు : అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి చిరుజల్లులు పడుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వారం రోజుల నుంచి కోత కోసిన వరిపంటను పొలాల్లో ఎండబెట్టారు. ఇప్పుడు వాతావరణంలో మార్పులు వచ్చి, చిరుజల్లులు కురుస్తుండడంతో కోసిన వరి పనలు తడిసిపోయాయి. సింగన్నదొరపాలెం, పొడుగుపాలెం, వారాడ, వి.సంతపాలెం, గవరపాలెం, కొరువాడ తదితర గ్రామాల్లో తడిసిన పంటను బుధవారం ఉదయం నుంచి మడుల్లోనే గాలికుప్పలుగా ఏర్పాటు చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అందరూ ఒకేసారి కుప్పలు ఏర్పాటు చేస్తుండడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది.



కొండపాలెంలో కుప్ప పెడుతున్న రైతులు



సింగన్నదొరపాలెంలో తడిచిన వరి పనలను కుప్ప వేస్తున్న రైతులు



శింగవరం పొలాల్లో తడిసిన వరి పనలు



లూలూరు వరి కుప్ప పై కవర్లు కప్పుతున్న అన్నదాతలు



ముకుందపురంలో వరి పనలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పలు గ్రామాల్లో కోసి ఆర బెట్టిన వరి పనలు తడిసిపోయాయి. వరి కుప్పల్లో నీరు చేరింది. బుధవారం కురిసిన వర్షానికి వడ్డాది,చిన అప్పనపాలెం, బుచ్చెయ్యపేట,శింగవరం, విజయరామరాజుపేట, లోపూడి,లూలూరు, దిబ్బిడి,సీతయ్యపేట,గున్నెంపూడి తదితర గ్రామాల్లో వరిపొలాల్లోకి నీరు చేరింది. నూర్చి ఆర బెట్టిన ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పుతున్నారు. వరి పంటతో పాటు రైతులు ఇటీవల జల్లిన నువ్వు,మినుము,పెసర,కంది ఇతర మొక్కలు నీటిలో నానిపోయాయి.

మాడుగుల రూరల్/మాడుగుల: అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. కోసిన వరి పనలను కుప్పలుగా పెడుతున్నారు. మండలంలో 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. వీటిలో 20 శాతం పంట తడిసి పోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

నాతవరం: అల్పపీడనం కారణంగా ఈనెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించినందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని పాయకరావుపేట వ్యవసాయశాఖ ఏడీ ఉమా ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో సిబ్బందికి పలు సూచలు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు వెళ్లి కోతలు కోయరాదని రైతులకు తెలియజేయాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పనలను కుప్పలు వేయించి, టార్పాలిన్లు కప్పించాలని సూచించారు. తడిసిన వరి చేనుపై ఉప్పు నీళ్ల పిచికారీ చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌వో ఉలబాల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

చీడికాడ: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హేమ సుందరరావు తెలిపారు.తురువోలులో ఎన్ఆర్‌జీఎస్ పథకంలో మంజూరు చేసిన పశువుల షెడ్ నిర్మాణాన్ని బుధవారం ఆయన పరిశీలించి, షెడ్ నిర్మిస్తున్న రైతు దేముడుతో మాట్లాడారు. అనంతరం ఏపీవో గంగునాయుడు మాట్లాడుతూ తురువోలులో ఇద్దరు రైతులకు షెడ్లు మంజూరైనట్టు చెప్పారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 33 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ: ఖండివరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో శస్త్ర చికిత్సలకు 33 మందిని ఎంపిక చేసినట్టు ఫౌండేషన్ డ్యూటీ జనరల్ మేనేజర్ వి.రమేష్ తెలిపారు.ఈ శిబిరంలో 175 మంది కంటిరోగులను పరీక్షించినట్టు చెప్పారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సహకారంతో 100 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో షిప్‌యార్డ్ సిబ్బంది ప్రశాంత్,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, రెల్లి హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

చోడవరం: ఎస్సీవర్గీకరణను అమలు చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు బుధవారం వేర్వేగా వినతిపత్రాలు అందజేశారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో కమిషన్‌ను రెల్లి హక్కుల రిజరేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎలుసూరి ఘాటీలు, ఎలకా మల్లిబాబు, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తా శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట విద్యుత్ లైన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదు



అర్జునగిరి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

చీడికాడ: విధులపట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీడీవో హేమసుందరరావు హెచ్చరించారు. మండలంలోని అర్జునగిరి సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టికలో సరిగా నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది టైమింగ్‌లో తేడాలను గుర్తించి హెచ్చరించారు.ఎటువంటి సమాచారం లేకుండా విధులకు హాజరుకాకుంటే వారిపై తీవ్రమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏపీవో గంగునాయుడు ఉన్నారు.